క్లుప్తంగా

1న మహాధర్నా

మల్కాపురం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వచ్చే నెల 1వ తేదీన జీవీఎంసీ ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం పిలుపునిచ్చారు. మహాధర్నాపై శుక్రవారం మల్కాపురంలోని ఆయన నివాసంలో ముఖ్యనేతలతో సమీక్షించారు.ప్రత్యేక ప్యాకేజీతో స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకుంటామని ఊదరగొట్టిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేడు మౌనం వహిస్తున్నాయన్నారు.వారి విధానాల వల్ల వేలాది మంది కార్మికుల తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని వివరించారు. నగరంలో ఏప్రిల్ 1న జరగనున్న మహాధర్నాకు అంతా జయప్రదం చేయాలని కోరారు.

ముస్లింల నిరసన



నల్ల బ్యాడ్జీలతో ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

గోపాలపట్నం: పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లు సవరణను వ్యతిరేకిస్తూ ముస్లింలు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా నిరసన తెలిపారు. ఇస్లామిక్ పర్సనల్ లాబోర్డు పిలుపుమేరకు కొత్తపాలెం మసీదు నూరానియాలో రంజాన్ ఉపవాస దీక్షల చివరి శుక్రవారం రోజు నల్ల బ్యాడ్జీలతో ప్రార్థనల్లో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా దారుణమని పలువురు వాపోయారు.

గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా యశోధర

- తొలిసారి అధ్యక్షురాలిగా మహిళ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

గాజువాక: గాజువాక న్యాయవాదుల సంఘం(బార్ అసోసియేషన్) అధ్యక్ష కార్యదర్శులుగా బి.యశోధర వేదమణి, డి.చిరంజీవి గెలుపొందారు. గాజువాక బార్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలిగా మహిళ ఎన్నిక కావడం ఇదే తొలిసారి. శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో సంయుక్త కార్యదర్శిగా పల్లా శ్రీనివాసరావు, కోశాధికారిగా ఇ.గిల్బర్ట్ గెలుపొందినట్టు ఎన్నికల అధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. కాగా, ఉపాధ్యక్షురాలిగా కె.సత్యవాణి, గ్రంథాలయ కార్యదర్శిగా బి.వి.ఎం.కృష్ణ, మహిళా ప్రతినిధిగా ఎం.సూర్యకళ, కార్యవర్గ సభ్యు లుగా ఎ.మురళీ మోహనరావు, సీహెచ్.గంగాభవాని, మంత్రి విజయ, ఆర్.రేవతి, ఎం.కనక మహాలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. విజయం సాధించిన అభ్యర్థులకు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు. సహాయ ఎన్నికల అధికారిగా న్యాయవాది పి.పార్వతీశం వ్యవహరించారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పరిరక్షణ



ఇంకుడు గుంతను సందర్శించి సూచనలిస్తున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: నీటిని ఒడిసి పట్టుకుందాం.. భావితరాలకు నీటిని అందిద్దామన్న నినాదంతో చేపట్టిన ఇంకుడు గుంతలు తవ్వించే కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో 89వ వార్డు యల్లపువానిపాలెం గణేష్‌నగర్ వాసి హనుమంతు రమేష్ ఇంకుడు గుంత తవ్వించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేడీ ఫౌండేషన్ పిలుపు మేరకు మిత్రుడు వైఎం కాళి చొరవతో ఇంకుడు గుంత ఏర్పాటు చేశానని తెలిపారు. దీని వల్ల భూగర్భజలాలను పరిరక్షించుకోవచ్చన్నారు.

ప్రత్యేక పూజలు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు వాయుపుత్రకాలనీలోని నూకాలమ్మతల్లి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. కొత్త అమావాస్య సందర్భంగా అమ్మవారు కొలువుదీరిన పీఠం చుట్టూ వేప,మామిడి తోరణాలతో అలంకరించారు. పంచామృతాలతో అమ్మవారిని అభిషేకించి,వస్త్రాలు,ఆభరణాలను అలంకరించి భక్తుల దర్శనభాగ్యం కల్పించారు. పూజల్లో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామోహన్‌నాయుడు, మిత్తిరెడ్డి శంకర్,ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో.. మేలుకో!

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజ్ బాక్సుల వద్ద రక్షణ చర్యలు చేపట్టలేదు. దీంతో పలు ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు మేల్కొని రక్షణ చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



ఆశవానిపాలెంలో ప్రమాదభరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



తుమ్మడపాలెంలో ప్రమాదకరంగా విద్యుత్ ఫ్యూజ్ బాక్స్

- ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్సులు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- రక్షణ చర్యలు శూన్యం
- ప్రమాదాల బారిన పాదచారులు

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57 వార్డుల పరిధిలోని కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐ కూడలి, తోట వీధి, గొల్లకంచరపాలెం, దుర్గానగర్, పల్లివీధి, గోకుల్‌నగర్, గౌరీనగర్ తుమ్మడపాలెం, సుభాష్‌నగర్, భవానిగార్డెన్స్ ఆశావానిపాలెం ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్‌బాక్స్‌లు విరిగి ఓ పక్కకు ఒరిగి ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వైర్లు పిల్లలకు సైతం అందే విధంగా ఉండడంతో అటుగా వెళ్లే పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సాయంత్రం సమయంలో వీధి దీపాలు వేసే బాక్సులు మూడడుగుల ఎత్తులో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో కొత్త బాక్స్ వేయాలని ఫిర్యాదులు చేసినా కంచరపాలెం జోన్–2 ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ సిబ్బంది, జీవీఎంసీ విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వీధుల సందుల్లో ఇనుప స్తంభాలు వేయడంతో చినుకులు పడితే స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.



జాషువానగర్ నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్

పొంచి ఉన్న ప్రమాదం



కంచరపాలెం బీఆర్‌టీఎస్ బస్టాప్ వద్ద ప్రమాదభరితంగా విద్యుత్ తీగలు

కంచరపాలెం బీఆర్‌టీఎస్ బస్టాప్‌కు ఆనుకుని విద్యుత్ వైర్లు నేలకు తాకుతున్నాయి. పైగా విద్యుత్ వైర్లకు తొడుగులు ఊడిపోయాయి. జాషువానగర్, తుమ్మడపాలెం, సుభాష్‌నగర్, తోటవీధి ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది. బస్టాప్‌లో ప్రయాణికులు, పాదచారులు మూత్ర విసర్జన చేస్తుంటారు. పగటి పూట సరే... చీకటి పడితే విద్యుత్ తీగలపై మూత్ర విసర్జన చేస్తే ప్రమాదాలు సంభవిస్తాయని ఆందోళన చెందుతున్నారు. వాటికి తొడుగు వేయాలని కోరినా పట్టించుకునే నాధుడే కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదభరితం



రహదారుల పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా దర్శనమిస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లకు ఉన్న రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. రక్షణ కంచెలు కనిపించడం లేదు. విద్యుత్ తీగలకు తొడుగులు తెగిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో అటుగా వెళ్లేటప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంటుంది.

– పుష్పలత, పాదచారిణి, గొల్ల కంచరపాలెం

భయం.. భయం



వీధుల్లో, ప్రధాన రహదారుల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు దిమ్మెలు శిథిలమయ్యాయి. దీంతో రక్షణ కరువైంది. విద్యుత్ తీగలు నేలకు తాకుతున్నాయి. విద్యుత్ దీపాల ఫ్యూజ్‌బాక్సులు చేతికందే ఎత్తులో ఉన్నాయి. అవి కూడా బయటకు ఉండడంతో అటు నుంచి రాకపోకలు సాగించాలంటే భయంగా ఉంటుంది.

– ఆతవ లోకేష్, ఊర్వశికూడలి

అధికారులు స్పందించాలి



రెండు వార్డుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సమస్యలపై ప్రజాప్రతినిధులు, విద్యుత్ విభాగ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదు. ప్రమాదభరిత సంఘటనలు చోటు చేసుకుంటే స్పందించే అధికారులు సమస్యలపై సమాచారం ఇచ్చినా పట్టనట్టు ఉంటున్నారు.ఈపీడీఎల్ ఉన్నతాధికారులు స్పందించి రక్షణ చర్యలు తీసుకోవాలి.

– గంటా తవుడుబాబు, ఐటీఐ జంక్షన్

ఎన్నికల కోడ్ ముగియలేదా!



ఎస్‌పీడీ సెంటర్‌లో ముసుగు వేసి ఉన్న వైఎస్సార్ విగ్రహం

విశాఖ విద్య: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు తొడిగారు.అయితే కోడ్ ఎత్తివేసినా ఎస్‌పీడీ సెంటర్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వేసిన ముసుగు మాత్రం అధికారులు తొలగించలేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిలువెత్తు విగ్రహానికి ఇలా ముసుగేసి వదిలేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు అధికారులు కావాలనే ఇలా చేస్తున్నారా..? అని మండిపడుతున్నారు.

ముగిసిన వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న స్థానికులు

గోపాలపట్నం: ఎల్జీ పాలిమర్స్ ఏర్పాటు చేసిన వైద్య శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఎల్జీ పాలిమర్స్ సీఎస్సార్ ఫౌండేషన్ ద్వారా ఐదురోజుల పాటు నిర్వహించిన వైద్య శిబిరంలో వెంకటాపురం, వెంకటాద్రి గార్డెన్ ప్రాంతాలకు చెందిన 1200 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు అందించారు. సీఎస్సార్ ఎండీ వూనక్యూన్‌లీ, డైరెక్టర్ సీకే జంగ్ పర్యవేక్షించారు.

కార్మికులకు అండగా వైఎస్సార్‌టీయూసీ



ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్

మల్కాపురం: కార్మికులకు అండగా నిలిచే యూనియన్ వైఎస్సార్‌టీయూసీ ఒక్కటేనని జిల్లా అధ్యక్షు డు రాయిపరెడ్డి అనిల్‌కుమార్ అన్నారు. వైఎస్సార్ టీయూసీ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో 58వ వార్డు పిలకవానిపాలెంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలో కేక్ కటింగ్, కోరమాండల్ ఎదురుగా గల కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. గుల్లలపాలెం నుంచి శ్రీహరిపురం వరకు పలు పరిశ్రమల కాంట్రాక్ట్ కార్మికులు, పార్టీ నాయకులతో కలిసి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలోని పలు పరిశ్రమల్లో వందల మంది కార్మికులకు ఉపాధి కల్పించిన ఘనత తమ యూనియన్‌కే దక్కుతుందన్నారు. ఆయా పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, కనీస సౌకర్యాలను యూనియన్ ద్వారా కల్పించామని వివరించారు. కార్మికుల సమస్యలపై స్పందించేందుకు తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని అనిల్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ ఆదేశాలతో యూనియన్, కార్మిక సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తానని చెప్పారు.

విద్యుత్ చార్జీల పెంపు దారుణం



మల్కాపురం సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: విద్యుత్ చార్జీల పెంపు, ఇంటింటా స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మల్కాపురం విద్యుత్ ఉప కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు మాట్లాడుతూ ట్రూ అప్ పేరిట విద్యుత్ చార్జీలను పెంచడం దారుణమన్నారు. తాము అధికారంలోకి వస్తే ఒక్క పైసా కూడా విద్యుత్ చార్జీ పెంచమని హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి ఇంటికి విద్యుత్ స్మార్ట్ మీటర్ బిగించి ప్రజలపై మోయలేని భారాలు వేస్తోందన్నారు. విద్యుత్ చార్జీలను తక్షణం తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించి విద్యుత్ బిల్లులు దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.పైడిరాజు, ఆర్.లక్ష్మణమూర్తి, పెంటారావు, సత్యారావు, రామారావు, భాస్కర్‌రావు, శ్రీనివాస్‌రావు, కార్యకర్తలు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ



కళాశాల విద్యార్థినులతో గ్రీన్ క్లైమేట్ సంస్థ సభ్యులు

కంచరపాలెం: ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని గ్రీన్ క్లైమేట్ టీంఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి ఎకో వారియర్ జె.వి.రత్నం పిలుపునిచ్చారు. శుక్రవారం జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో గ్రీన్ గ్లోబ్ నేచర్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ మాణిక్య కుమారి నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవీఎంసీ పరిధిలో అమలవుతున్న ఎకో వైజాగ్‌ను జయప్రదం చేయాలని కోరారు. భూమి మీద ఏ జీవి అంతరించినా దాని ప్రభావం మానవాళి మీదే పడుతుందని హెచ్చరించారు. వేసవిలో మనం ఆహారంగా తీసుకునే దేశీయ పండ్ల విత్తనాలు సేకరించి విత్తన బంతులు తయారు చేసి సామాజిక వనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆధ్యాపకులు డాక్టర్ ఎన్.నాగరాజు, డాక్టర్ ఎం. పద్మ సుందరి, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, గ్రీన్ గ్లోబ్ నేచర్ క్లబ్ ప్రెసిడెంట్ కె.ప్రీతి, సెక్రటరీ ఎన్. మానస, ఎ.సంజన, ఎస్.లక్ష్మీకీర్తన తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు ఆరాధికులు భయభక్తులతో జీవించాలి



శిలువ మార్గం చూపిస్తున్న ఫాదర్లు

కంచరపాలెం: క్రీస్తు ఆరాధికులు భయభక్తులు కలిగి జీవించాలని జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ అన్నారు. పాస్కా కాలం 3వ శుక్రవారాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం రక్షణగిరిలో పరిశుద్ధ శిలువ మార్గాన్ని ఘనంగా నిర్వహించారు. క్రీస్తులో భయభక్తులు కలిగి ఉండడం ద్వారా ముక్తి లభిస్తుందన్నారు. అనంతరం దివ్యబలిపూజ నిర్వహించారు. ఏప్రిల్ 18న జరగనున్న గుడ్‌ఫ్రైడే వేడుకలకు రక్షణగిరిని ముస్తాబు చేస్తున్నట్లు కమిటీ నిర్వాహకుడు బేతా జోసెఫ్ తెలిపారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిగా విరుద్ధంగా పాలన

సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

మల్కాపురం: రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ఆరోపించారు.మే 10,11వ తేదీల్లో విశాఖ నగరంలో జరగనున్న మహాసభ వివరాలను వివరిస్తూ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని వివరించారు. నిత్యావసర సరకుల ధరలు పెరగడంతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీ కరణ చేయాలనే లక్ష్యంతో కేంద్రం నిర్ణయాలు తీసుకుంటే దానికి కూటమి సర్కార్ వంత పాడడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకిస్తూ తమ పార్టీ మహాసభలను మే 10,11వ తేదీల్లో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్టు వివరించారు. మహాసభలను అంతా జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకుడు బి.సత్యానందరావు, పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యదర్శి కె.సత్యాంజనేయ,జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చదువుపై శ్రద్ధతో చెడు అలవాట్లకు దూరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అఖిల్

మల్కాపురం: విద్యార్థులు, యువత చదువుపై శ్రద్ధ చూపాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జేడీ ఫౌండేషన్ ప్రతినిధి అఖిల్ సూచించారు. జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాలు, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. చెడు స్నేహం, చెడు వ్యసనాల వల్ల విలువైన జీవితం నాశనమవడంతోపాటు తల్లిదండ్రులను బాధపెట్టేవారవుతారన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి ఎంతో నష్టమని వివరించారు. ప్రతి ఒక్కరూ క్లాత్, పేపర్ బ్యాగులు వినియోగించాలన్నారు. ఇంట్లో తల్లిదండ్రులు ప్లాస్టిక్ వినియోగించడం వల్ల కలిగే నష్టాలను వారికి తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ గాజువాక ఇన్‌చార్జి వనమాలి, లక్కీ అమర్ పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుపై కమిటీ ఏర్పాటు చేయాలి

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర కార్మిక శాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ (డీసీఎల్) డి.శ్రీనివాసులు ఉక్కు యాజమాన్యానికి సూచించారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె నోటీసుపై శుక్రవారం సాయంత్రం నగరంలో ఉక్కు యాజమాన్యం, కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు, కాంట్రాక్టర్లతో డీసీఎల్ సమావేశం ఏర్పాటు చేశారు. అక్రమ తొలగింపులు ఆపాలని, 45 ఏళ్లు దాటిన వారికి వైద్య పరీక్షలు రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై డీసీఎల్ మాట్లాడుతూ కార్మికుల తొలగింపుపై కాంట్రాక్టర్లు, కార్మిక సంఘాలు, యాజమాన్యం ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. పని లేదని తొలగించిన కార్మికులను ఒక పూల్‌గా ఏర్పాటు చేసి తిరిగి పని వచ్చినప్పుడు వారినే తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 7న తదుపరి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో రీజనల్ లేబర్ కమిషనర్ మొహంతి, యాజమాన్య ప్రతినిధులతో పాటు కాంట్రాక్టర్ల సంఘం నాయకులు బొడ్డ సన్యాసిరావు, అప్పలనాయుడు, కార్మిక సంఘాల నాయకులు కె.ఎం. శ్రీనివాస్, నీరుకొండ రామచంద్రరావు, జి. శ్రీనివాసరావు, మంత్రి రవి, సత్యారావు, వంశీకృష్ణ, గుర్నాథ్ పాల్గొన్నారు.

నూకాలమ్మా.. చల్లగ చూడమ్మా



కోలాటం జట్టుకు సౌండ్ బాక్స్ అందిస్తున్న మళ్ల సతీష్

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల గ్రామ దేవత నూకాంబిక పండగ సందర్భంగా శుక్రవారం సాయంత్రం ప్రతిమల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. బాజీ జంక్షన్‌లో అమ్మవారి ప్రతిమలకు అలంకరణచేసి పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, విచిత్రవేషధారణలు, తప్పెటగుళ్ల కోలాటాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ఘటాల ఊరేగిస్తున్న భక్తులకు స్థానికులు పసుపు నీళ్లతో కాళ్లు కడిగి పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.


నేడు ప్రధాన పండగ

గోపాలపట్నం ప్రధాన రహదారిలో వెలసిన నూకాలమ్మ అమ్మవారి ప్రధాన పండగ ఆదివారం జరుగుతుందని ఆలయ చైర్మన్ మళ్ల సతీష్ తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. సాయంత్రం తీర్థ మహోత్సవం జరుగుతుందని తెలిపారు.

సౌండ్ బాక్సుల అందజేత

పండగ సందర్భంగా ఆలయ ధర్మకర్త మళ్ల సతీష్, కమిటీ సభ్యులు గోపాలపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన 11 కోలాటం జట్లకు 11 సౌండ్ బాక్సులు అందించారు.

ఆలయ అభివృద్ధికి సమష్టి కృషి



తోట నగేష్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

విశాఖ విద్య: వరసిద్ధి వినాయక ఆలయ అభివృద్ధికి కాలనీవాసులను సమన్వయం చేసుకుని కమిటీ సభ్యులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్ వరసిద్ధి వినాయక ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఆయన శుక్రవారం గణనాథుడిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ పెద్దలు గణనాథుడి ప్రసాదాన్ని అందజేసి, సత్కరించారు. వరసిద్ధి వినాయక ఆలయాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ఇక్కడ నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల గురించి తెలిపారు. కమిటీ పెద్దలు డి. సూర్యనారాయణ, ప్రసాద్ రెడ్డి, ఐవీ శంకర్‌రావు, డాక్టర్ కె. శిరీష, పి. సత్యనారాయణ,గృహేశ్వర్, వెంకటేశ్వరరావు, లంక అనిల్, దేవుడు బాబు, గండి అప్పారావు, రత్నకుమారి పాల్గొన్నారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



ఎస్‌పీడీ తసీన్ మసీదులో విందు స్వీకరిస్తున్న ముస్లింలు

విశాఖ విద్య: పవిత్ర రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం సందర్భంగా మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆరాధకులు తమ శరీరాన్ని శుద్ధి చేసుకొని, కొత్త దుస్తులు ధరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎస్‌పీడీ సెంటర్‌లోని ఎన్ఎస్‌టీఎల్ గేటుకు సమీపంలో గల తసీన్ మసీదులో ముస్లింల సందడి కనిపించింది. ఇదే చోట ఏర్పాటు చేసిన హైదరాబాద్ హలీంను తినేందుకు ముస్లింలతోపాటు జాతీయ రహదారిపై వెళ్లే వారు ఎంతో ఆసక్తి చూపారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలంతా కలసి విందు స్వీకరించారు.